క్లుప్తంగా

ఆ షెడ్డును తొలగించండి

కర్నూలు (సిటీ) : దిన్నెదేవరపాడు గ్రామం సర్వే నెంబర్ 213/1బీలో రస్తా పోరం బోకును ఆక్రమించి నిర్మించుకున్న షెడ్డును తొలగించాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు సోమవారం తహసీల్దార్ శివరాముడును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా అధికారులెవరూ స్పందించడం లేద న్నారు. ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు ఆ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం టెం డర్లు వేశారని, పనులు మొదలుపెట్టేందుకు సమీపంలోని పోరంబోకు స్థలంలో వేసిన షెడ్డు అడ్డుగా ఉందని తెలిపారు. రెవెన్యూ అధి కారులు స్పందించి ఆ షెడ్డును తొలగించి అం డర్ బ్రిడ్జి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు.

మైపర్‌లో అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో సోమవారం అయోధ్య రామాలయ ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి పాల్గొని రాములవారి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయోధ్య రామాలయం ప్రతిష్ఠ , ఆ ఆలయ చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అయోధ్య ఆలయంలో నిర్వహించిన రాములవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వీక్షించారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25లక్షల వరకు వైద్యం పొందేలా చర్యలు తీసుకుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రవీంద్ర రెడ్డి సూచించారు. సోమవారం కోడుమూరు-1 గ్రామ సచివాలయ పరిధిలోని కాలనీల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హేమ సుందరం, స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల ఉపయోగం గురించి ప్రజలకు వివరించారు. జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస మూర్తి, ఎంపీహెచ్ఈఓలు నరసప్ప, నివాస్, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలసిన రజక సంఘం నాయకులు

కల్లూరు: పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన రజక సంఘం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. సోమవారం పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 150 కుటుంబాలు దాదాపు 500 ఓటర్లు చాకలి పెద్ద మద్దిలేటిని అధ్యక్షుడిగా, చిన్న మద్దిలేటిని ఉపాధ్యక్షుడిగా, చిన్న బుడ్డన్న కార్యదర్శిగా, మద్దిలేటి, తిరుపాలు గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సంఘం సమావేశ భవనం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

కుల గణన పక్కాగా చేపట్టాలి

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. కల్లూరు గ్రామీణ ప్రాంతాల్లోని 19 గ్రామ సచివాలయాల్లో కుల గణన సర్వే సోమవారం కొనసాగింది. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే వివరాలు నమోదు చేస్తున్నారు. మండలంలో 19 గ్రామ సచివాలయాల్లో 28.52శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీఓ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తన స్వగృహంలో పంపిణీ చేశారు. కోడుమూరు మండలం ముడుమాలగుర్తి గ్రామానికి చెందిన బోయ మల్లమారి మధుకు రూ.70 వేల రూపాయలు చెక్కును, గుడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కి మంజూరు చేసిన రూ.90 వేల చెక్కును తండ్రి మల్లికార్జునకు అందజేశారు. లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జగదానందకారక.. మంగళకరమవు నీ రాక!





ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సీతారాముల పట్టాభిషేకం మహోత్సవం, తిలకిస్తున్న విజయవాడ అష్టాక్షరీ పీఠాధిపతి



అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని లలితా పీఠంలో లైవ్‌లో వీక్షిస్తున్న భక్తులు



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



ఏ క్యాంప్ శ్రీనిలయం అపార్ట్‌మెంట్‌లో..



శోభాయాత్రలో మహిళల సందడి



డ్రమ్స్ వాయిస్తున్న బాలబాలికలు

- మార్మోగిన జై శ్రీరామ్ నామం
- అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లాలో పండుగ వాతావరణం
- కర్నూలు పురవీధుల్లో రాముల వారి విగ్రహాలతో శోభాయాత్ర
- సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకారుల ప్రదర్శనలు
- ఎగ్జిబిషన్ మైదానంలో శ్రీరాముని పట్టాభిషేకం
- హాజరైన వేలాదిమంది భక్తులు

కర్నూలు కల్చరల్: అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుక నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. రామాలయాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు సీతారాముల కల్యాణోత్సవాలు, పట్టాభిషేకం, భజనలు, పల్లకీ సేవలు, రథోత్సవాలు, ఊరేగింపులు జరిగాయి. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ రామ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసుకొని అయోధ్యలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ ఘట్టాన్ని సామూహికంగా వీక్షించారు. పెసరబ్యాల్లు, పానకం ప్రసాదాలను పంపిణీ చేశారు. ఇళ్ల ముంగిట దీపాలు వెలిగించి హారతులు పట్టారు. రాంబొట్ల ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సంబరాలు అంబరాన్నంటాయి. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఎగ్జిబిషన్ మైదానం వరకు శ్రీరాములవారి విగ్రహంతో శోభాయాత్రలో జరిగింది. శోభాయాత్రలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, అధ్యక్షుడు కె.క్రిష్టన్న, ప్రధాన కార్యదర్శి నాగోజీరావు, కోశాధికారి కల్కి మురళి, కార్యదర్శి నటేష్ కుమార్, ఉపాధ్యక్షులు మహాబలేష్, హరీష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం

ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన నమూనా అయోధ్య రామాలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 22 నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో 108 కలశాలతో శ్రీరాముని పాదుకలకు భక్తులు అభిషేకం చేశారు. ముందు పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ భరత్, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూలు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా వేద పండితులు నాగఫణి శాస్త్రి, రాజేశర్మ బృందం పట్టాభిషేక ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో నిర్వహించారు. విజయవాడ అష్టాక్షరీ పీఠాధిపతులు శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. వేలాది మంది భక్తులు ఎగ్జిబిషన్ మైదానానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కేశవ రెడ్డి, మాంటిస్సోరి విద్యా సంస్థల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రామాయణ ఘట్టాల పోస్టర్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, తదితరులు పాల్గొన్నారు. కాగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కనుల పండువగా శోభాయాత్ర..

శ్రీరాముల వారి విగ్రహంతో నగరంలో నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. చిత్తారి వీధి, వన్‌టౌన్, పూలబజార్, మించిన్ బజార్, అంబేడ్కర్ సర్కిల్, కొండారెడ్డి బురుజు, కోట్లసర్కిల్ మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు ఊరేగింపు సాగింది. సంస్కృతి సంప్రదాయాలు తెలియ జేసేలా విన్యాసాలు, ప్రదర్శనలు నిర్వహించారు. కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులు శోభాయాత్రను జ్యోతులతో స్వాగతం పలికారు. టీటీడీ పురాణ పండితులు పౌరాణిక శిరోమణి వి.రామకృష్ణ శేషసాయి వక్తగా, వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు నాగఫణి శాస్త్రి, చల్లా దామోదర్‌రెడ్డి, గోపీనాథ్, లక్ష్మయ్య, పద్మావతి, స్వప్న, అనురాధ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు (టౌన్) : అయోధ్యలో శ్రీరాముడు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంతో దేశమంతా శ్రీరామ స్మరణతో మార్మోగుతుందని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి అన్నారు. సోమవారం నగరంలోని నిర్వహించిన శ్రీరాముడి శోభాయాత్రలో పాల్గొని అనంతరం జమ్మిచెట్టు వద్ద ఉన్న శ్రీ లలితా పీఠంలో ప్రత్యేక పూజలు చేశారు.



నగరంలో భక్తజనం మధ్య శ్రీరాముడి శోభాయాత్ర



సూర్యనారాయణ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం



శోభాయాత్రలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయ మనోహరి



ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాంబొట్ల ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



శ్రీరాంబొట్ల దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మేయర్, ఎమ్మెల్యే

కర్నూలు (టౌన్) : ఎంతో చరిత్ర కలిగిన పురాతన శ్రీరాంబొట్ల దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవాలయ కమిటీ నూతన చైర్మన్ నగరూరు దీప్తి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ 5 వ వార్డు పరిధిలోని రాంబొట్ల దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో రాంబొట్ల దేవాలయ కమిటీకి చైర్మన్‌గా, కమిటీ సభ్యులుగా నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులుగా గొల్ల రాజేశ్వరి, పూజారి యశోద, మదిశెట్టి శ్రీదేవి, జె.విజయ్‌కుమార్, బోడ రవికుమార్, పార్ల పెద్దయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, నాయకులు గడ్డం రామక్రిష్ణ, కార్పొరేటర్లు సుజాతమ్మ, పల్లవి, స్టాండింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, యూసుఫ్‌బాషా, క్రిష్ణకాంత్‌శర్మ, శేషు యాదవ్, ఖాదర్‌బాషా, హకీమ్, కేదార్‌నాథ్, సోమిశెట్టి వెంకట్రామయ్యలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు కేటాయించండి

కర్నూలు (టౌన్) : తమకు టిడ్కో గృహాలు కేటాయించాలని నగరంలోని వివిధ ఏరియాలకు చెదిన మునీర్, అబ్దుల్ లతీఫ్ తదితరులు అధికారులకు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని సమావేశ హాలులో జగనన్నకు చెబుదాం పేరుతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. వాటిని కమిషనర్ పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జగనన్నకు చెబుదాంలో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, నగరపాలక మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

విన్నపాలు ఇవే...

- సంతోష్‌నగర్‌లో సీసీ, రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని అదే కాలనీకి చెందిన మౌలా అనే వ్యక్తి కోరారు.
- మట్టి రోడ్డు వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఇక్కడ సీసీ రోడ్డు వేయాలని సోమిశెట్టినగర్‌కు చెందిన అశోక్ కుమార్ విన్నవించారు.
- మురుగునీటి కాల్వలు ఏర్పాటు చేయాలని ఏపీహెచ్‌పీ కాలనీకి చెందిన వెంకటేశ్వర ప్రసాద్ అభ్యర్థించారు.
- గూడు లేని తమకు టిడ్కో గృహం మంజూరు చేయాలని ఛత్రిబాగ్‌కు చెందిన మహేశ్వరి, కొత్తపేటకు చెందిన హుస్సేన్‌బీ వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.
- తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు నిర్మించాలని ప్రేమనగర్‌కు చెందిన సుజాత కోరారు.
- తాగునీరు, మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తకు పరామర్శ

కోడుమూరు రూరల్ : కోడుమూరులో గుడి నిర్మాణం చేపడుతుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వర్కూరు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణను సోమవారం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి పరామర్శించారు. కృష్ణకు దగ్గరుండి వైద్యం చేయించడంతో పాటు, త్వరగా కోలుకునేలా చూడాలని జెడ్పీటీసీ రఘునాథ్ రెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వర్‌రెడ్డిలకు కుడా చైర్మన్ కోట్ల హర్ష సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్టులపై నిరసన

కర్నూలు(సెంట్రల్): చలో విజయవాడకు వెళ్లే అంగన్‌వాడీలను అరెస్టు చేయడంపై సోమవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట చేతులకు బేడీల్లా తాళ్లు కట్టుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప, అంగన్‌వాడీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల మాట్లాడుతూ.. అరెస్టు చేయడం సరికాదన్నారు.

- అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. అంగన్‌వాడీలను చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్‌గాంధీ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి సీపీఎం పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, టి.రాముడు, నారాయణ, ఆనంద్‌బాబు, నగేష్, అబ్దుల్లా పాల్గొన్నారు.
- అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా 24వ తేదీన కార్మిక సంఘాలు రాష్ట్ర బంద్ చేపట్టనున్నట్లు సీఐటీయూ,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప తెలిపారు. సమ్మె విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం రాత్రి కార్మిక,కర్షక భవన్‌లో ఆ యూనియన్ల నాయకులు చర్చించుకున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 504 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలకు 504 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉద యం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 5,479 మందికి గాను 4,975 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గూడూరు ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, చాగలమర్రి సెయింట్ ఆన్స్ పరీక్ష కేంద్రంలో ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు చూచిరాతలకు పాల్పడటంతో వారిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- ప్రగతి యూనిట్ పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



ప్రగతి పేపర్ ప్లేట్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పొదుపు సంఘాలకు సహాయసహకారాలు అందిస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక గురురాఘవేంద్ర నగర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రగతి పేపర్ ప్లేట్ల యూనిట్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో జగనన్న మహిళా మార్టులు, జగనన్న ఈ మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్ల ద్వారా పొదుపు మహిళలకు జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే జగనన్న చేయూత, జగనన్న ఆసరా, జగనన్న సున్నావడ్డీ పథకం, జగనన్న తోడు వంటి ఎన్నో పథకాలను అమలు చేసి ప్రతి సభ్యురాలిని స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇంటిని చక్కదిద్దుకునే మహిళలు వ్యాపారాన్ని విజయవంతంగా చేయగలరన్నారు. ప్రతి మహిళ తన కాళ్ల మీద తాను నిలబడి కుటుంబాన్ని తీర్చిదిద్దుకునేలా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఒక్కో ప్రగతి యూనిట్‌కు సగటున రూ.2.50 లక్షలు మంజూరు చేసేలా మెప్మా కార్యాచరణ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగశివలీలా, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళీ, జిలానీ, సుధాకర్, నగేష్, పుణ్యవతి, ప్రొప్రైటర్ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు నేరుగా ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించా రు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. నగరంలోని పాస్టర్లు బిషప్ అమ్రోజ్, కరుణాకర్, మార్టిన్ ప్రసన్న ఎమ్మెల్యేను కలిశారు. పాస్టర్లకు ఇంటి స్థలాలతో పాటు చర్చిల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తూ ఆర్థికంగా సహకారం అందిస్తుందన్నారు. ప్రస్తుతం ఇళ్ల స్థలాలతో పాటు చర్చి నిర్మాణాల వ్యయాన్ని రూ.5 లక్షల నుంచి పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ ఎ-3) పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1 నుంచి 8 తరగతుల వారికి (సీబీఏ-2) క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు, 9, 10 తరగతుల వారికి గతంలో మాదిరిగానే ఎఫ్‌ఏ-3 పరీక్షలు జరుగుతాయన్నారు. సీబీఏ పరీక్షలో డిస్క్రిప్టివ్, ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయన్నారు. విద్యార్థులు గమనించి ప్రశ్నపత్రంలో టిక్ చేస్తూ ఓఎంఆర్ షీట్ నందు బబుల్ చేయాల్సి ఉంటుందని వివరించారు. 1 నుంచి 8వ తరగతికి మాత్రమే ఓఎంఆర్ షీట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ప్రభుత్వం జారీ చేసిన ప్రశ్న పత్రాలతో పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు ఉంటాయి. 1 నుంచి 5 తరగతుల వారికి 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు.

పేదలకు 'పట్టా'భిషేకం

- నన్నూరు-2 జగనన్న కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని



మహిళకు ఇంటి పట్టా పంపిణీ అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : అయోధ్య వేడుకల సమయంలో నన్నూరులోని గడెం తిప్పపై 2వ జగనన్న కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ముందుగా జాతీయ రహదారి పక్కన, కాలనీ ముందు భాగాన నూతనంగా ఏర్పాటు చేసిన దివంగతనేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే పూలమాల వేసి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టాల ప్రదానోత్సవం పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కుసుమలత, హుసేనాపురం సింగిల్ విండో అధ్యక్షుడు నాగతిరుపాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు.

ఇళ్ల పట్టాలపై టీడీపీ కోర్టుకెళ్లడం దుర్మార్గమైన చర్య

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఇష్టంలేక టీడీపీ నేతలు కోర్టుకెళ్లి స్టేలుతెచ్చి అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనచర్య అని ఎమ్మెల్యే అన్నారు. అంతేగాక 2014 ఎన్నికల్లో డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులను రద్దుచేస్తామని, ఎవరూ పొదుపు రుణాలు చెల్లించవద్దని టీడీపీ అధినేత మహిళలను నయవంచనకు గురిచేసిన విషయం మరచిపోవద్దన్నారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందజేసి పొదుపు సంఘాలకు ప్రాణం పోస్తే, 2014లో టీడీపీ ప్రభుత్వం పొదుపు రుణాలను రూ.1 వడ్డి వసూలు చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నాయకులకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

రూ.3కోట్లతో వంతెన ఆధునికీకరణ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నన్నూరు ప్రజల సౌలభ్యం కోసం బైపాస్ రోడ్డు వేయడం, గ్రామంలో శిథిలావస్థకు చేరిన పురాతన ఇరుకైన వంతెనను దాదాపు రూ.3 కోట్లతో ఆధునీకరించడమేగాక వెడల్పు పెంచడం జరిగిందన్నారు. గ్రామంలో 2వ జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణానికి సుమారు రూ.30 లక్షల సొంత నిధులు ఖర్చు చేసిన గ్రామనేత చెన్నారెడ్డి ఔదార్యం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాణ్యం ఎంపీపీ ఉశేన్‌బీ, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సర్పంచులు గోవర్ధన్, రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.